## ప్రచురణల కొరకు సంప్రదించండి :

# స్వామి కృప పబ్లికేషన్స్

గొలగమూడి (పోస్టు),

(వయా) సర్వేపల్లి - 524 321. నెల్లూరు జిల్లా.

## గమనిక

శ్రీ స్వామివారికి దక్షిణ పంపేవారు

ది రిసీవర్ - భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి

హ్యూమేనిటేరియన్ మిషన్,

గొలగమూడి (పోస్టు), (వయా) సర్వేపల్లి

నెల్లూరు జిల్లా - **524 321.**

అడ్రసుకు పంపమనవి వ్యక్తిపేరుతో పంపరాదు



## స్మృతి రహిత ప్రసన్నాయ నమః



# భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి

సేకరణ : **పెసల సుబ్బరామయ్య**

గొలగమూడి, నెల్లూరు జిల్లా - **524 321.**

# స్మృతి రహిత ప్రసన్నాయ నమః

"వాళ్ళుండే దాన్ని బట్టయ్యా మనముండేది అన్న మాట అక్షరాల నిజమని ఈ శీర్షిక క్రింద అనుభవాలన్నీ తెలుపుతున్నాయి. భగవంతుడు దర్శనమివ్వడమంటే - పిలవకుండానే కొందరికి దర్శనమిస్తున్నారంటే - అది కేవలం వారు జీవించిన విధానమేనని తెలుస్తుంది. శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారి తండ్రి గారికి సాయిబాబా వరుసగా వారంరోజులు ప్రతిరోజు మధ్యాహ్నం 3 గం॥లకు దర్శనమిచ్చి, వారిని కౌగిలించుకొని అదృశ్యమయ్యే వారు. షిరిడీకి పోతే అక్కడ విగ్రహానికి బదులు సజీవంగా బాబా కూర్చునట్లు గంటల తరబడి దర్శనమైంది. మనందరికి అలా దర్శనం కాదేమిటి? వారలా దర్శనమివ్వడమునకు కారణం - వారి జీవిత విధానమే. ఏ జీవి ఏమి అనుభవించాలో ముందే నిర్ణయమై ఉంటుంది అన్న విషమై దృఢమైన విశ్వాసం గలిగి ఆశకు లోబడక ఆయుర్వేద వైద్యం చేసేవాడు. ఎంతమందికి వైద్యం చేసినా డబ్బు అడిగేవారు కాదు. వైద్యం చేయుంచుకొన్నవారు హుండీలో వేసిన డబ్బులతో జీవించే వారు. ఎంత డబ్బు వచ్చిన సాయంకాలమునకు అంతా ఖర్చుచేసేవారు. మందులు పుటం వేసేవారికి, మందుదినుసులు తెచ్చేవారు. మందులు నూరే వారికి, గుర్రపు బండివానికి, పని వారికి అవసరాన్ని బట్టి ఇచ్చేసేవారు. భక్తులిచ్చిన తేనెసీసాలు అవసరమైన పేషెంట్ల కిచ్చేవారు. నెయ్యి, పాలు, పండ్లు, అందరికీ పంచేసేవారు. ఇది వారి జీవిత విధానం గనుకనే భగవంతుడు



వారి ప్రార్థన లేకుండానే దర్శనమిచ్చారు. ఇలాగే శ్రీ స్వామి వారు కొందరికి వారి ప్రార్థన లేకుండానే ప్రసన్నులైనారు. అందుకు కారణం వారి జీవిత విధానమే. అంతే గాని వారు స్వామికి చేసే అలంకరణ, నివేదనలు కాదని మనం గుర్తించాలి. అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వారు వ్రాసిచ్చిన మాటకే వారు ఎక్కువ విలువనిస్తున్నారన్నమాట. సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ సాధించమన్నారు. మనసాధనలో ఈ విషయాలు ముఖ్యపాత్ర వహించినప్పుడు శ్రీ స్వామి వారి కృప మనం అడుగకుండానే లభిస్తుంది.

1. విజయనగరంలో 1986 సం॥లో నందగిరి సుందరరావు గారి తల్లిగారు శ్రీ స్వామిని ప్రార్థించకుండానే శ్రీ స్వామి పరిచయం లేకపోయినా స్మృతి రహిత ప్రసన్నులయిన శ్రీ స్వామి భౌతికంగా దర్శనమిచ్చి వారి భిక్ష స్వీకరించారు. సుందరరావు గారి ప్రార్థన ప్రకారం ఆ తర్వాత రెండు సార్లు పట్టపగలు అనేక మంది గ్రామస్తులకు సుందరరావుగారి ఇంటి దగ్గరే దర్శనమిచ్చి వారి బిక్ష స్వీకరించారు.

   ఈ రెండు మార్లు కూడా పట్టపగలు అనేక మంది విజయనగరం గ్రామస్థులు శ్రీ స్వామివారిని చూచారు.

2. తొగురు వెంకయ్యగారు అనే భక్తులకు వారేమి శ్రీ స్వామివారిని కోరకుండానే కలలో ఒక మంత్రం చెప్పి ఆ మంత్రం యొక్క అర్థం కూడా వివరించి ఉచ్చారణా దోషాలను కూడా

సవరించారు. శ్రీ స్వామి వారి చరిత్రంతటిలో మంత్రోపదేశం చేయడం వీరికి ఒక్కరికే తప్ప మరెవ్వరికీ చెయ్యలేదు.

3. లక్కాకుల క్రిష్ణయ్యగారు వారి బిడ్డ ప్రమాదకరమైన అనారోగ్య పరిస్థితిలో ఆసుపత్రిలో ఉండగా వారు అసలు శ్రీ స్వామివారిని ప్రార్థించకపోయినా, తలవకపోయినా శ్రీ స్వామివారు వారికి స్వప్నంలో దర్శనమిచ్చి బిడ్డకు బాగుంది తన వద్దకు దర్శనానికి తీసుకురమ్మని చెప్పినారు. వారికి ఆ స్వప్నం అర్థమవ్వక పోయినా శ్రీ స్వామివారు మరలా స్వప్న దర్శనమిచ్చి వారిని గుర్తింప చేసి వారి బిడ్డకు స్వస్థత కలిగించి వారి చెంతకు చేర్చుకున్నారు. భక్తిశ్రద్ధలు కలిగించారు. ఈ శ్రద్ధా భక్తులు అణగారి పోకుండా అభివృద్ధి చేసుకుంటే మన మెంతో మేలు పొందుతాము. లేకుంటే పోయేవాళ్ళను పోనిచ్చే దేగదయ్యా అన్నవారి లెక్కలోకి పోతాము.

4. డి. నాగేశ్వరరావు గార్కి శ్రీస్వామివారు వారు ప్రార్థించక పోయినా వారి తప్పులు తెలియపరచి వారిని సన్మార్గంలో నడిపించు చున్నారు. స్మృతి రహిత ప్రసన్నులు శ్రీ స్వామివారు.

5. ఉచ్చూరు కాపురస్తుడు శివరామయ్యగారు శ్రీ స్వామివారు ఆదేశించిన దాంపత్య సుఖం నిషేధాన్ని తప్పినప్పుడు శ్రీ స్వామి వారు వారిని స్వప్నంలో మూడుసార్లు హెచ్చరించి మూడవ సారి కాన్సరు బిళ్ళలు పెట్టి భయపెట్టి ఆ దంపతులు దాంపత్య సుఖం నిషేధాన్ని తప్పక పాటిస్తామని క్షమించమని శ్రీస్వామిని



ప్రార్థించగానే వెంటనే కాన్సరు బిళ్ళలు ఏ వైద్యం లేకుండానే పోగొట్టి వారిని సత్యమార్గంలో నడిపిస్తున్నారు. మనం వారిని ప్రార్థించని సమయంలో కూడా మనలను సర్వసాక్షియై చూస్తున్నారని సర్వదా ఏమరకుండా గుర్తుంచుకొని జీవిస్తే మనం ఆయన కృపకు అర్హులమవుతాము.

6. నారాయణమూర్తి అనే భక్తులు వారిని స్మృతి రహిత ప్రసన్నులయిన శ్రీ స్వామివారు ఏ విధంగా ఆపదలో రక్షించారో తెలుపుచున్నారు. ఒక రోజు రాత్రి వారి గదిలో దోమల నివారణ కొరకు టార్టాయిస్ చక్రం లాంటిది వెలిగించి మంచం ప్రక్కన కిటికీలో పెట్టి పడుకున్నారు. ఒక రాత్రి వేళ వారి పాప గుక్కపట్టి ఏడుస్తున్నది. వారు నిద్రలేచి చూచేసరికి గది అంతా దట్టంగా పొగకమ్ముకొని ఉంది. ఏమి జరుగుతున్నదో అర్థం కాలేదు. వెంటనే లేచి పాపను వేరొక గదిలో కూర్చోపెట్టి వారి భార్యను లేపి చూస్తే వారు కప్పుకున్న షోలాపూరు దుప్పటి 7,8 చోట్ల కాలి ఉన్నది. క్రింద బొంత, నవ్వారు కొంత కాలింది. పైన ఫ్యాన్ తిరుగుతూ ఉంది. కిటికీ రెక్కలు మూసి ఉన్నవి. ఏ మాత్రం మంట రేగినా ప్రమాదమయ్యేది. ఇన్ని కాలినా వారి వంటికి గాని వారు ధరించిన బట్టలుగానీ కొంచెం కూడా కాలలేదు. దీనిలో శ్రీ స్వామివారే రక్షించారు అనడానికి ఆస్కారమే లేదు. వారు శ్రీస్వామి వారి ఆరాధనకు గొలగమూడికి వచ్చినప్పుడు వారికి

స్వప్న దర్శనమిచ్చి స్వప్న సందేశంతో స్పష్టంగా శ్రీ స్వామియే అగ్ని ప్రమాదం నుండి రక్షించానని తెలియపరిచారు.

7. వి.బి.ఆర్ శర్మగారు, విజయవాడ వారు శ్రీస్వామివారి దర్శనానికి గొలగమూడి వస్తుండగా రైలు ఎక్కబోతూ కాలు జారి కమ్మిపట్టు తప్పిపోయి వెనుకనుండి జనం విపరీతంగా తోసి వేయుటలో రైలుకు, ప్లాట్ ఫారంకు మధ్య సందులో పడిపోయారు. వారికి గార్డు డ్రైవరు వచ్చి లేవదీసే వరకు స్పృహ లేదు. చెయ్యి గూడ తొలగితే పిండి కట్టు వేసారు. వెన్నుపాము ప్రక్కన పిడికిలి పట్టేంత రంధ్రం పడింది. హాస్పిటల్‌లో చేరి శ్రీస్వామివారి దయవలన చెయ్యి, వీపుగాయం త్వరలోనే మానిపోయి ఆరోగ్యవంతులై నెల తిరగకుండానే శ్రీ స్వామివారి సమాధి దర్శనం చేసుకోగల్గారు. ఈ ఆపదలో ప్రాణం పోవలసిన ప్రమాదం జరిగినా ప్రార్థన చేయకుండానే శ్రీ స్వామివారు అకాల మృత్యువు నుండి వారిని రక్షించారు.

8. గొలగమూడిలో పుల్లారెడ్డిగారి నాలుగు సంవత్సరముల బిడ్డను స్మృతి రహిత ప్రసన్నులయిన శ్రీస్వామివారు ఈ విధంగా రక్షించారు. వారి నాలుగు సం॥ల బిడ్డ ఒక రోజు ఆటకాయ తనంగా వారి బఱ్ఱెల వెంబడి పరిగెత్తసాగాడు. ఆ పిల్లవాడు పోవటం ఎవ్వరూ చూడలేదు. ఆ బఱ్ఱెలు ఆ సమీపంలోని సర్వేపల్లి చెరువులో నీళ్ళు త్రాగుచుండగా ఆ పిల్లవాడు ఒక బఱ్ఱెతోక పట్టుకొని బఱ్ఱె నీళ్ళలో ఈదుకుంటూ పోతుంటే ఆ



బిడ్డ అదొక ఆటగా ఉత్సాహంగా, ధైర్యంగా దాని తోక వదలకుండా పట్టుకొని దాని తోటి నీళ్ళలో చాల దూరం పోయాడు అది చివరకు గట్టెక్కింది. కానీ అప్పటికే అది దిగిన చోటునుండి రెండు మైళ్ళు వెళ్ళిపోయింది. అక్కడ ఆ బిడ్డ దాని తోక వదిలేసి అటు ఇటు తిరిగి ఆ పొదలలో కూర్చుని ఏడుస్తున్నాడు. ఏడ్చి ఏడ్చి మే నెల ఎండలకు గొంతెండిపోయింది. పేడ ఏరుకుంటూ ఒకామె అచ్చటికి వచ్చి ఆ బిడ్డను ఇంటికి తీసుకువెళ్ళి నీళ్ళు త్రాగించి అన్నం పెట్టింది. ఆకలి తీరి ఆడుకుంటున్నాడు. గొలగమూడిలో మనసుబుగారింట్లో ఈ పిల్లవానిని చూసిన వెట్టి అతను ఆ బిడ్డ ఉండే ఇంటికి వెళ్ళి చూసి "ఈ బిడ్డ ఫలనా వాళ్ళ పిల్లవాడు అని చెప్పగా వారు ఆ బిడ్డను ఆ తల్లిదండ్రులకు అప్పజెప్పారు. సురక్షితంగా శ్రీ స్వామి ఆ బిడ్డను ఇంతటి ఆపద నుండి కాపాడి క్షేమంగా ఇల్లు చేర్చారు.

9. శ్రీమతి డి.హెచ్.యస్. లక్ష్మిగారు తిరుపతిలో నిద్రిస్తుండగా తనకు 6 అం॥ ప్రక్కన త్రాచుపాము పడుకొని ఉంది. నిద్రలో తన చీరగాని, చెయ్యిగాని పాముకు తగిలితే కాటేసి ఉండేది. మెలకువ రావడం పాముని గుర్తించడం, కెవ్వున కేక వేసి దూరంగా గెంతడం జరిగింది. ప్రక్క రూము తలుపు వేసింది. ఆ పాము ఎంతో సేపు బుసకొట్టి ఎటో వెళ్ళిపోయింది. ఈ విధంగా శ్రీ స్వామివారిని ప్రార్థన చేయకుండానే ఆమెను పాము ఆపదనుండి కాపాడారు.

10. యస్. శరణ్యగారు వారి శ్రీమతి గారు గర్భిణిగా నెలలతో ఉండగా వారు ఒకనాటి రాత్రి మూత్ర విసర్జనకు లేచారు. వారికొక వికృతాకారంగల భయంకరమైన స్త్రీ మూర్తి కనిపించింది. వారు భయపడి మూత్ర విసర్జనకు వెళ్ళకుండా నేలమీద పరుపు మీద పడుకున్నారు. ఆ స్త్రీ మూర్తి ఏదో వస్తువు వారి పైకి విసిరింది. ఆ వస్తువు వారి మోచేయి క్రింద తగిలింది. ఆ వస్తువు తగిలిన చోట కాలిన మచ్చ తెల్లవారి స్పష్టంగా కనిపించింది. ఆ స్త్రీ మూర్తి భయంకరంగా అక్కడే పడుకుని యున్న వారి భార్య వైపు చూస్తున్నది. వెంటనే ప్రక్కనున్న పూజ గదిలో నుండి శ్రీ సాయిబాబా, శ్రీ వెంకయ్య స్వామి వారు అక్కడికి వచ్చి ఆ స్త్రీ మూర్తిని బెదిరించారు. సాయిబాబా తన కర్రను శ్రీ వెంకయ్య స్వామివారి చేతికిచ్చి ఆ స్త్రీ మూర్తిని బయటకు గెంటమన్నారు. శ్రీ సాయి, శ్రీ వెంకయ్య స్వామి ఆ స్త్రీమూర్తిని బయటకు నెట్టారు. గడియవేసి ఉండే తలుపులు తెరుచుకొని ఆమె బయటకు పోతుంటే శ్రీ సాయి, శ్రీ స్వామి వారు ఆమెను తరుముతున్నట్లు అదే ద్వారము గుండా బయటకు వెళ్ళారు. ఈ విషయమంతా అంటే ఆ స్త్రీ మూర్తిని ఇద్దరు స్వాములు బయటకు నెట్టుకు పోవడం ఆ హాలులో పడుకొని యున్న వారి తమ్ముడు కూడా మెలకువ వచ్చి చూచాడు. తెల్లవారి వారి తమ్మునకు మాత్రం జ్వరం వచ్చి పడక పెట్టారు. వారి శ్రీమతి క్షేమంగా ప్రసవించారు.



వారు ప్రార్థన చేయకుండానే ఈ ప్రమాద పరిస్థితిలో వారిని రక్షించారు. శ్రీ స్వామి వారి రక్షణ లేకపోతే మొదటి సారి గర్భస్రావం అయినట్లే అయ్యేది. వారు మామూలుగా పారాయణ చేయడం తప్ప ఈ ప్రమాద సమయంలో వారు శ్రీ స్వామి వారిని ప్రార్థించిందే లేదు.

11. శ్రీ సుబ్బరామయ్య మాష్టర్ గారి బిడ్డను నిద్రలో తేలుకాటుకు గురి కాకుండా ప్రార్థించని సమయంలో శ్రీ స్వామి వారు ఆదుకున్నారు. ఆ బిడ్డకు మెలక్కువ తెప్పించి తేలును చూపించారు.

12. శ్రీమతి విశాలాక్ష్మి గార్కి (హైద్రాబాద్) వారు "స్వామి కృప" పుస్తకం పారాయణ చేసుకుంటూ ఉండగా, వారు ఒక రోజు గణపతి దేవాలయానికి వెళ్లినపుడు శ్రీ స్వామివారు ఒక వృద్ధుని రూపంలో దర్శనమిచ్చి వారు తన బాధను గురించి ఏమీ చెప్పకుండానే గొంతునొప్పికి పసుపు తినమని గొంతు నొప్పి పోతుందని, శ్రీ స్వామే ఆ వృద్ధుని రూపంలో చెప్పినారు. వారట్లే చేయగా గొంతు నొప్పి తగ్గిపోయింది.

13. నెల్లూరు జిల్లా కట్టా రామలక్ష్మమ్మగారు వారి కాలు మీద పుండుకు వైద్యానికి మద్రాస్‌లో హస్పిటల్‌లో ఉండగా కాలు తీసెయ్యాలని డాక్టర్లు అనుకుంటున్న సమయంలో వారు బాధపడుతున్నారు. శ్రీ స్వామి వారిని ప్రార్థించకపోయినా శ్రీ స్వామివారు స్వప్న దర్శనమిచ్చి వారికి తనను గుర్తు చేసారు.

తనకు ఆపరేషన్ లేకుండా చేయమని ప్రార్థించింది. అలాగే ఆమె బాధ మందులతోనే తొలగి ఆపరేషన్ లేకుండా పోయింది.

14. సూళ్ళురుపేట సదానందం గారికి అసలు శ్రీ స్వామి పరిచయం లేకుండానే వారికి భౌతికంగా దర్శనమిచ్చి వారి మానసిక వ్యధను తొలగించారు. తర్వాత వారికి సమాధి దర్శనం చేయించారు. స్మృతి రహిత ప్రసన్నులయిన శ్రీస్వామి ఆ విధంగా వారిని అనుగ్రహించారు.

15. చల్లా శ్రీరాముల శెట్టిగారు ఎవరో ఇచ్చిన కాషాయ గుడ్డలు ఉపయోగించు దామనుకుంటే ఆ రాత్రే శ్రీ స్వామివారు వారికి స్వప్న దర్శనమిచ్చి వాటిని ఉపయోగించేటట్లయితే ఆబద్ధం చెప్పకూడదని హెచ్చరించారు. వారు ప్రార్థన చేయకుండానే వారిని సన్మార్గంలో నడిపించారు.

16. రాయపెద్ది వివేకానందగారు డ్యూటీకి వెళ్ళే సమయంలో ఇంటి వద్దనే చిన్న దెబ్బ తగిలించి, ఆఫీసుకు ఆ రోజు వెళ్ళనీయకుండా చేసి జరగబోయే పెద్ద ప్రమాదం నుండి రక్షించారు. వారు డ్యూటికి వెళ్ళే ప్రాంతంలో మతకలహాలు రేగి హత్యలు, రైడింగులు జరుగుచున్నాయని వారు అక్కడికి వెళ్ళి ఉంటే తప్పుక ప్రమాదానికి గురి అయి ఉండేవారని తర్వాత తెలిసింది.

17. నూతేటి శ్రీరామయ్య తన ఆయిల్ ఇంజనును సజ్జ చేలో నీరు తోడాక అక్కడ నుండి తెచ్చి నిమ్మతోట లోని బావికి బిగించి



నిమ్మచెట్లకు నీరు కొట్టుకునే వారు. ఈ రెండు బావులకు ఆ ఇంజనును తిప్పుతుండేవారు. నిమ్మతోట బావిలోతెక్కువ కనుక బావి అంచున ఆరడుగుల గుంట త్రవ్వి అందులోకి ఇంజను దింపి బిగించేవారు. ఒకసారి మోకుల సహాయంతో ఇంజన్ దింపేటప్పుడు చేయి జారినందున ఇంజన్ బావిలోని నీటిలో పడిపోయింద నుకున్నారు. కాని స్మృతి రహిత ప్రసన్నులయిన శ్రీ స్వామివారు పడకుండా ప్రమాదం తప్పించారు. తర్వాత వారు శ్రీ స్వామిని దర్శించినప్పుడు "ఆ ఇంజనును అక్కడికిక్కడకు తిప్పొద్దు" అని మందలించి వారే ఆ ప్రమాదం నుండి రక్షించినట్లు శ్రీ స్వామి తెలియచేసినారు.

18. మంగుపల్లెలో కలరా వల్ల గుంపులు, గుంపులుగా మనుష్యులు చనిపోతున్నారు. ఆ గ్రామస్తులు శ్రీ స్వామివారికి మొర పెట్టుకునేందుకు వీలులేకుండా పెన్నానది గట్లు తన్నుకొని పారుతున్నది. కాని నది ఆవలి గట్టునున్న శ్రీ స్వామివారు చలమానాయుడి చేతికొక కాగడా వెలిగించి ఇచ్చి "అయ్యా నీ చూపు కాగడా మీద నిల్పి అటు ఇటూ చూడకుండా నదిలోకి దిగి నడువు. నేను నీ వెనకాలే వస్తుంటాను అని ఆజ్ఞాపించారు స్వామి. నదిలో నీరు మోకాళ్ళ వరకే ఉండడం చలమానాయుణ్ణి ఆశ్చర్య పరచింది. శ్రీ స్వామి నది దాటి మంగుపల్లి పొలిమేరలో ఒక కర్ర నాటి దానికొక దారం కట్టి వచ్చారు. అది మొదలు ఆ గ్రామంలో ఒక్కరు కూడా మరణించలేదు. క్రమంగా కలరా అదృశ్యమైంది.

19. ఆళ్ళగడ్డలో ఒకరికి శ్రీ స్వామి స్వప్న దర్శనమిచ్చి "నీ కారులో నా ఫోటో పెట్టుకోమని" చెప్పారు. రెండు రోజుల తర్వాత తన శత్రువుల బాంబుల దాడి నుండి బ్రతికి బయట పడ్డప్పుడు స్వామి ఫోటో పెట్టమన్న కారణం వారికి అర్థమైంది. మనం ప్రార్థించనవసరం లేకుండానే శ్రీ స్వామి మనలను రక్షిస్తారన్న మాట. అలాంటి రక్షణ పొందాలంటే సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురుసేవ అన్న పంచశీల సూత్రం మన ఆచరణలో ఉండాలి.

20. సి. రాజారాం రెడ్డిగారి కుమారుడు అకస్మాత్తుగా గొలగమూడిలో భజన మందిరంలో గుండెనొప్పి వచ్చి పడిపోగా ఆ సమయంలో వారి ప్రార్థనతో నిమిత్తం లేకుండానే నిద్రపోతున్న వారిని లేపి శ్రీ స్వామి వారు ఒక వృద్ధుని రూపంలో భౌతికంగా దర్శనమిచ్చి నాలుగు హోమియో మాత్రలు ఇచ్చి నొప్పి నివారించారు.

21. "ఆవుల లక్ష్మి నరుసు ఇంటికి ఎదురుగా వున్న శ్రీరామయ్య గారి యింటి ఆవరణలో వుండే పీనుగుల పాతర ఎత్తి వేసుకోవాలి" అని శ్రీరామయ్య గార్కి శ్రీ స్వామివారు ఒకసారి జాబు వ్రాయించారు. వారచ్చట అదే విధంగా త్రవ్వి చూస్తే నిజంగానే ఎముకలు, బొగ్గులు బోలెడున్నాయి అవి త్రవ్వి తీసివేశాక వారింట్లో అప్పటి వరకు తాండవించిన అనారోగ్యము, మనస్పర్థలు మొదలగు బాధలు పోయి శాంతి లభించింది. వారేమి అడుగకుండానే శ్రీ స్వామి వారు వారి



బాధలకు నివారణోపాయం సూచించి వారి చేత చేయించి, వారి బాధలు తొలగించారు.

22. భక్త సంరక్షణే తన పరమ కర్తవ్యంగా తలచిన శ్రీస్వామి నిర్నిద్రులై అహర్నిశలు ఏమరుపాటు లేక భక్తపాలన చేయుచున్నారు. మనకు రానున్న కష్టాలను తప్పించుకునే మార్గం సూచించడమే కాక, ఆ సూచనలు మనం పాటించేటట్లు మరలా మరలా మనను కన్నతల్లి కంటె ఎక్కువ ప్రేమతో హెచ్చరించు చున్నారు. ఆ సూచనలు పాటించడంలో అడ్డంకులు వస్తుంటే తిరిగి వారే వాటిని తీర్చుచూ పాటింపచేసి మనలను ఆపదల నుండి, బాధలనుండి రక్షించు చున్నారు. ఇనుకుర్తి గ్రామం కారి రామస్వామి గారికి "44 రోజులలో గండం వుంది, పోతుంది 72 సంవత్సరాల రెండు నెలల ఆయుస్సు తిరుపతి, కంచి, తిరువళ్ళూరు పోయి ప్రతిచోట స్నానం చేసి, టెంకాయ కొట్టి నిద్రచేసి రావాలి" అని స్వామివారు చీటి వ్రాయించి ఇవ్వటమే కాకుండా వారు ఆ విధంగా చేయుట మరచిపోతే శ్రీ స్వామి మరలా దర్శనానికి వచ్చినప్పుడు డబ్బులు లేకపోతే ఎవరి వద్దయినా అప్పు తీసుకునైనా సరే యాత్ర పొమ్మని చెప్పారు. వారలాగే యాత్రవెళ్ళి తిరిగి వచ్చిన వెంటనే కసుమూరు మస్తానయ్య దర్గా వద్ద పెద్ద నాగుపాము అడ్డగించగా భయపడి శ్రీ స్వామిని స్మరించిన వెంటనే పాము వెళ్ళిపోయింది. వెంటనే శ్రీ స్వామిని దర్శించగా శ్రీ స్వామి నీ 44 రోజుల

గండం పోయింది కదా! అని వారికి తన కృప ఎరుక పరిచారు.

23. ఒకసారి కె. బుజ్జయ్య గార్కి డబ్బులు అవసరమై తన గొఱ్ఱెలను కసాయికి అమ్మాలనుకున్నారు. ఆనాటి రాత్రే శ్రీ స్వామివారు స్వప్నంలో "గొఱ్ఱెలను కసాయివానికి అమ్మడం ఎంతపాపం? ఏమి సంగతి?" అని పలికారు. కానీ వారికి డబ్బులు అత్యవసరమై స్వామీ నీదే భారం అని అమ్మడానికి వెళితే అచ్చట శ్రీ స్వామి ఎవ్వరినీ కొననీయకుండా చేసి, చివరకు ప్రక్క ఊరువారు వచ్చి "మేము మేపుకుంటాము ధర తగ్గించి ఇవ్వమని" అడిగించి వారికి అమ్మేటట్లు చేసారు. వారికి డబ్బులు అవసరం తీరేటట్లు, పాపం చెయ్యకుండా రక్షించారు శ్రీ స్వామి. శ్రీ స్వామిని ప్రార్థించ కుండానే వారిని కనిపెట్టి మంచి మార్గంలో నడిపించారు. స్మృతి రహిత ప్రసన్నులు కదా శ్రీ స్వామి.

24. కస్తూరి అంకయ్యగారి మనవడికి రెండున్నర సంవత్సరముల వయసులో నీటి గండమున్నది వీర రాఘన స్వామి ఆ గండం తీసివేస్తారని చీటీ వ్రాయించి ఇవ్వటమే కాకుండా శ్రీ స్వామి వారు ఆ పిల్లవానిని నీళ్ళలో మునిగిపోకుండా దిగుడుబావిలో తేలునట్లు చేసి రక్షించారు. వారి ప్రార్థనతో నిమిత్తం లేకుండానే శ్రీ స్వామి ఈ ఆపదలో రక్షించారు.

25. శ్రీ స్వామివారి సేవలో గడుపుచున్న రోశిరెడ్డి శ్రీ స్వామి వారిని ఏమి అడగక పోయినా, రోశిరెడ్డి గారిని "మీ గ్రామం వెళ్ళి



నిమ్మచెట్లు గుచ్చిపెట్టిరా" అని వారి చేత ఆ పని చేయించి, తర్వాత వారింట్లో వారికి ప్రేరణ పెట్టి వారితో ఆ తోట పని చేయించి లక్షల ఆదాయం వచ్చేటట్లు చేశారు.

26. రోశిరెడ్డి గారిని ఒకరోజు శ్రీ స్వామివారు "మీ చిన్న కుమారుని పేర చీటీ వ్రాసి యివ్వు" అని తొందర చేసి వారు వ్రాసి యిచ్చిన చీటీ శ్రీ స్వామివారు తన తొడ క్రింద పెట్టుకు కూర్చున్నారు. మూడవరోజు వారి చిన్న కుమారుడు శ్రీ స్వామి దర్శనార్థం వచ్చి "నిండు బరువు బండి రాజంపేట దగ్గర కొండ నెక్కుచూ ఎద్దులు అనికేసుకుని బండి నిలిపే వీలులేక వెనుకకు దొర్లుతూ 40 అడుగుల లోతు నిట్టనిలువు కొండ చరియ వెంబడి వాగులో పడిపోయిందని, కానీ బండి ఎద్దులు, మనిషికీ ఏ మాత్రం దెబ్బలు తగలలేదని శ్రీ స్వామియే ఈ ప్రమాదం నుండి రక్షించారని శ్రీ స్వామి వారికి కృతజ్ఞతలు చెప్పుటకు వచ్చానని చెప్పాడు". స్మృతి రహిత ప్రసన్నులు అంటే మనం ప్రార్థించకుండానే శ్రీ స్వామి మనలను ఆపద నుండి రక్షించి అనుగ్రహించుట అని తెలియ పరిచారు.

27. కలిచేడు ఈశ్వరమ్మ గారింటికి ఒకసారి శ్రీ స్వామివారు వచ్చి వారు వంట చేసే చోటుకు వెళ్ళి ఆ వసారాకు రేకులు వేయించమన్నారు. "ఆర్థికంగా అశక్తురాలను కదా తమకు తెలియనిదేమున్నది స్వామి" అని విన్నవించింది ఆమె. "వాళ్ళే చూచుకుంటారులే" అని మాత్రం అన్నారు శ్రీ స్వామివారు.

అయిదు రోజుల తర్వాత ఆమె సజ్జవడలు చేస్తున్నది. నూనె బాణలికి వున్నట్లుండి వేలెడు రంధ్రం పడి నూనె మండుతున్న పొయ్యిలో పడుతుండగా వారు ఇంటిలో నుండి ఒక బేసిన్ తెచ్చి ఆ బాండలిలో మిగిలిన నూనెను అందులో పోసుకున్న తర్వాత ఆమెకొక విషయం ఆశ్చర్యంగా తోచింది. అంత నూనె మండే పొయ్యిలోకి కారినపుడు మంటలు ఎంతగానో ఎగసి వసారా, ఇల్లు తగలపడవలసింది కదా! అయినా ఆ విధంగా ప్రమాదం జరగకుండా శ్రీ స్వామివారే రక్షించారని గ్రహించుకున్నారు. ఈ సంఘటనలో వారేమీ ప్రార్థన చేయకుండానే ప్రమాదం జరగకుండా శ్రీ స్వామివారే రక్షించారు.

28. పెనవర్తిలోని పోలుమస్తానయ్య గారు ఒకసారి శ్రీ స్వామిని పెనవర్తి నుండి తలుపూరుకు నారాయణరెడ్డి గారి కారులో తీసుకు వెళ్ళుచుండగా శ్రీ స్వామి ఉన్నట్లుండి "అయ్యా! గొంతు కోయవలసి వస్తుందే" అన్నారు. కాసేపటిలో శ్రీ స్వామివారు హఠాత్తుగా పెట్టిన కేకతో బ్రేకు వేయకుండానే కారాగిపోయింది. వెంటనే ఒక మేక చెంగున కారు ముందు నుండి రోడ్డుకు అడ్డంగా పరుగెత్తింది. కారు ఆ క్షణంలో నిలవకపోతే దాని గొంతు తెగేదే. ఈ సన్నివేశం ద్వారా వారేమీ స్వామిని కోరకుండానే ప్రార్థించకుండానే ప్రమాదం తప్పించడమే కాకుండా వారికి స్వామి సమర్థత్వం గ్రహించి భక్తి, విశ్వాసాలు కలిగేటట్లు అనుగ్రహించారు.



29. చెర్లోపల్లి శేషయ్య నాయుడుగారు ఒకసారి త్రోవన వస్తుంటే శ్రీ స్వామివారు వారిని పిలిచి "నీకు ఒక సంవత్సరం నాలుగు నెలలు ఆరు రోజులకు ప్రాణ గండం ఉంది. తిరువళ్ళూరు వీర రాఘవస్వామి తప్పిస్తారు" అని చీటీ వ్రాయించి ఇచ్చారు. కొన్నాళ్ళ తరువాత తన పొలంలో కయ్య నిండా నీళ్ళు పెట్టి రొంపి దుక్కి దున్నుటకు ఎద్దులను నాగలికి కట్టి తోలగా ఒక యెద్దు కయ్యలోకి దిగిన వెంటనే క్రింద పడి తన్నుకుంటున్నది. ఏమిటా! అని ఆత్రుతగా ఆ ఎద్దును తోక బట్టి లేప ప్రయత్నించగా కాళ్ళకు చివుక్కు మన్నట్లయిందట. ఎద్దును ప్రక్కకు లాగుచుండగా చేలో కరెంటు ఎర్తయినట్లు గుర్తించి కేకలు వేసి మెయిన్ ఆపించారు. ఒక ఎద్దు మాత్రం అక్కడి కక్కడే చనిపోయింది. మరొక ఎద్దు తప్పించుకున్నది. వారికి మాత్రం ఏ అపాయం జరగలేదు. ఈ ప్రమాదం సరిగ్గా శ్రీ స్వామివారు వ్రాసిచ్చిన 1 సం॥ నాలుగు నెలలు ఆరు రోజులు గండం ఆ రోజుకే రావలసి వుంది. కేవలం శ్రీ స్వామివారే వారిని రక్షించారు. వారేమి కోరకుండానే శ్రీ స్వామి వారి ఆపద నుండి రక్షించారు.

ప్రతివారిని శ్రీ స్వామివారు అలా ఆదుకోవాలిగదా అని మీ రడుగవచ్చు. శ్రీ స్వామి వారి మాట మనకు శిలా శాసనం వంటిది. "వాళ్ళుండే దాన్ని బట్టి గదయ్యా మనముండేది" అన్నారు శ్రీ స్వామివారు. శ్రీ స్వామివారు బాగా నడిచే

రోజులలో ఎక్కడెక్కడో తిరిగి అర్ధరాత్రి వేళ ఈ శేషయ్యనాయుడు గారింటికి అన్నానికి వచ్చేవారు. నాయుడుగారి తల్లిగారు ఎంతో శ్రద్ధా భక్తులతో శ్రీ స్వామి వారు వస్తారని అన్నం ఉంచి పెట్టి వారి కొరకు ఎదురుచూచేవారు. ఆ వేళ గాని వేళలో కూడా ఆమె శ్రీ స్వామి వారికి కడుపు నిండా అన్నం పెట్టి పడుకోమనే వారు. శ్రీ స్వామి వారెప్పుడూ ఒక ముండ్ల తడిక వేసుకొని పడుకునేవారట. వీళ్ళంతా ముండ్లు గుచ్చుకునే తడిక మీద ఎందుకు ఈ మంచం మీద పడుకోమంటే - ఈ తడిక ఎంత మెత్తని పరుపులా ఉందో చూడమనే వారట. ఆలా ఆమె శ్రీ స్వామి వారిని సేవించ బట్టే ఆమె కుమారుని ప్రాణగండం నుండి శ్రీ స్వామి వారు రక్షించారు. మనం ముఖ్యంగా గమనించ వలసినదేమంటే తల్లిదండ్రులు శ్రీ స్వామి వారికి చేసిన సేవ బిడ్డలను కూడా రక్షిస్తుంది. శ్రీ స్వామి వారు లేరనే కొరత మనకు ఎప్పుడూ లేదు. "అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకో" అన్నారు. అంతేగాక "పొయ్యే దెక్కడికయ్యా సూర్యచంద్రులు ఉన్నంత వరకు ఉండేది గదా" అన్నారు. గనుక మనమెప్పుడు ఏ జీవిని ఆదరించినా, హింసించినా అదంతా శ్రీ స్వామి వారికే చెందుతుందనే భావన ముఖ్యంగా మన కలవడాలి.

30. శ్రీ స్వామివారి సేవలో నున్న జయరామరాజుగారు ఒకరోజు వారి ఎద్దులను మేతకు అడవికి తోలుకు పోతుండగా శ్రీ స్వామి



వాటిని తోలేసి రావయ్యా అన్నారు, మేపేవాళ్ళు లేరు స్వామీ! నేను వస్తే ఎట్లా అంటే శ్రీ స్వామివారు పరవాలేదులే తోలేసి వచ్చేయ్ అన్నారు. శ్రీ స్వామి మీద భారం వేసి అచట పశువులమేపే పిల్లలకు చెప్పి వచ్చి శ్రీ స్వామివారి చెంత కూర్చున్నారు. కొంత సేపటికి శ్రీ స్వామివారు ఉన్నఫళంగా లేచి కర్ర తీసుకొని ధేయ్ ధేయ్ అని అరుస్తూ పది బారల దూరం పోయి తిరిగి వచ్చి కూర్చున్నారు. తర్వాత తెలిసింది దాని వివరం. శ్రీ స్వామి వారు ఇచ్చట నుండే అడవిలో చిఱుతపులి నోట పడబోయిన వారి ఎద్దులను రక్షించారని. వారేమీ కోరకుండానే శ్రీ స్వామివారు ఈ దివ్యలీలతో వారి సామర్థ్యము తెలియపరచి ఎద్దును రక్షించారు.

31. గొలగమూడిలోని తూపిలి వెంకయ్యగారు చాలాకాలం శ్రీ స్వామి వారి బృందమునకు శ్రద్ధతో గుడ్డలు ఉతికేవారు. ఒకరోజు వారింట్లో నిద్ర పోతున్న వెంకయ్యకు అర్ధరాత్రి మెలకువ వచ్చి ఇక మంచం మీద ఉండలేక ఎవరో లేపినట్లుగా లేచి బీడీ కాల్చుకోడానికి ఇంట్లోని దీపం వద్దకు వెళ్ళాడు. అర్ధరాత్రి వేళ మసక చీకట్లో నట్టింట కూర్చునియున్న మనిషిని చూచి బేరుమని అరిచాడు. ఈ అరుపుకు నట్టింట వున్న మనిషి (దొంగ) కూడా అరిచాడు. దాంతో చుట్టు ప్రక్కలవారు అందరూ కూడారు. వారి ఇంటిలో పాత్ర సామాను, ఖరీదైన గుడ్డలన్నీ పోగుపెట్టుకుని కూర్చున్న దొంగ కనిపించగా కట్టేసి, ఇంత

సులభంగా కదలక చిక్కిపోయావేమి? అని అడుగగా ఇట్లా చెప్పాడు. "నేను ఇంటిలో ప్రవేశించబోయేటప్పుడే ఎవరో వీపున చరిచినట్లయి నిర్వీర్య మైనాను. కానీ ఎట్లాగో బలంకూడ గట్టుకుని అన్ని వస్తువులు మూట కట్టుకున్నాను. కానీ "ఎక్కడ వక్కడ పెట్టేయ్" అని ఎవరో గద్దించి చెప్పినట్లుంది. ఆ ఆజ్ఞ మీరలేక కట్టిన మూట విప్పి యిలా పరచిపెట్టాను. కళ్లు కనపడక, లెచేందుకు శక్తి లేక యిలా కూలబడ్డాను. లేకుంటే "ఒక్క వేటుకు చాలుతారా మీరంతా" అన్నాడు. శ్రీ స్వామివారు స్మృతి రహిత ప్రసన్నులు. ప్రార్థన చేయకుండానే వారికి నష్టం జరగకుండా రక్షించారు.

32. నెల్లూరు మాకాని వెంకట్రావుగారు మద్రాసు వెళ్ళుచూ, శ్రీ స్వామి వారిని అనుమతి కోరగా మమూలుగా 'వెళ్ళిరమ్మను' అని గాని లేక "బంగారంగా పోయిరమ్మను" అని గాని అనే స్వామి ఆ రోజు "తిరువళ్ళూరు వీరరాఘవ స్వామి, కంచి వరద రాజుల స్వామి నిన్ను రక్షిస్తారు పో " అన్నారు. వెంకట్రావు మద్రాసు వెళ్ళి రద్దీగా వున్న బస్సు ఎక్కడంలో ఒక కాలు పుట్ బోర్డు మీద వుంచి ఒక చేతితో కమ్మి పట్టుకున్నాడు, రెండవ కాలు ఎత్తకమునుపే బస్సు కదలడం వలన కాలు నేల రాచుకుంటున్నది. అతడు పడిపోయాడనుకుని వెనుకవాళ్ళు అరుస్తున్నా డ్రైవరుకు వినబడక బస్ ఆపట్లేదు. ఆ పరిస్థితిలో ముందు టైరు పగిలి బస్సు వున్న పళంగా



ఆగిపోయింది. అట్లా జరగక పోతే వెంకట్రావు గారి చేయి పట్టు తప్పి క్రిందపడి ప్రాణాపాయమై వుండేది. కేవలం శ్రీ స్వామి వారి ఆశీర్వచనం వల్లనే రక్షింపబడ్డానని వారు గ్రహించారు. వారి ప్రార్థనతో నిమిత్తం లేకుండానే శ్రీ స్వామి వారు వీరిని ప్రాణ గండం నుండి రక్షించారు.

33. ఒకరోజు కలిచేడు 'నరసారెడ్డి గారికి' పాము గండమున్నది. తిరువళ్ళూరు. వీరరాఘవ స్వామి రక్షిస్తారు అని చీటీ వ్రాయించారు. కొంతకాలం తర్వాత గాది అడుగున కొద్దిగా వడ్లుంటే అవి తీసేందుకు ఒకరోజు రెడ్డిగారు గాదిలోకి దిగాడు. తనకాలికి ఏదో మెత్తగా కప్పలాగా తగిలింది. కాలు ఎన్ని చోట్లకు మార్చినా అట్లాగే తగులుచున్నది. ఏమిటి ఇన్ని కప్పలున్నాయని లాంతరు తెప్పించి చూస్తే తాను పెద్ద త్రాచుపామును త్రొక్కుచున్నట్లు తెలుసుకుని ఒక్కసారిగా బయటకు దూకి పామును కొట్టేసారు. త్రాచుపామును త్రొక్కినప్పటికిని అది కరవలేదంటే అది కేవలం శ్రీ స్వామి వ్రాసి ఇచ్చిన చీటీ ప్రభావమేనని గుర్తించారు. వారేమీ ప్రార్థించకుండానే శ్రీ స్వామి వారు జరగబోయే ప్రమాదం నుండి ఆశీస్సులిచ్చి రక్షించారు.

34. మహిమలూరులోని మునికూటి రామయ్య గారికి కడుపునొప్పి, దడ, బలహీనత, వళ్ళు నొప్పులు వచ్చి ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. ఒక రాత్రి శ్రీ స్వామి వారు వారికి స్వప్నంలో దర్శన మిచ్చి "నేను పెన్న బద్వేలులో వున్నాను. నా దగ్గరకు రా

నయం చేస్తాను" అని చెప్పారు. అదే ప్రకారం వారు శ్రీ స్వామిని దర్శించి శ్రీ స్వామి ఆదేశించినట్లు ఒక నెలరోజులు శ్రీ స్వామి వారి సన్నిధిలో ఉండగా ఏ మందులు లేకుండానే వారి ఆరోగ్యం బాగుపడింది. అప్పటి నుండి చాలా భక్తి శ్రద్ధలతో శ్రీ స్వామివారికి ఆతిధ్యమిస్తూ సేవించు కునేవారు. వారు కోరకుండానే ఆర్థిక పరిస్థితి బాగుచేసి మిద్దె ఇల్లు కట్టుకునేటట్లు చేసారు శ్రీస్వామివారు.

35. రాజపద్మాపురంలో ఒక రైతు ఒక బక్క ఎద్దును సేద్యం కొరకు తోలుకొస్తున్నాడు. దారిలో ఆ ఎద్దు నడవలేక పడిపోయి ఎంత కొట్టినా, తోక పట్టి లేవనెత్తినా లేవలేదు. దూరంగా ఉన్న శ్రీ స్వామివారు తన సేవకుని పిలిచి "అయ్యా ఈ మార్గాన్నే పోయి ఎద్దును కొట్టే ఆయనను కొట్టవద్దని చెప్పు" అన్నారు. ఆ సేవకుడు అట్లా చెప్పినా ఆ రైతు ఆ ఎద్దును బాదుతున్నాడు. శ్రీ స్వామివారు స్వయంగా అచటికి వచ్చి ఆ ఎద్దును తాకి "లెయ్" అన్నారు. దానికాశక్తి ఎలా వచ్చిందో చివుక్కున లేచి నిలిచింది. "అయ్యా నాలుగు రోజులు బండి కట్టబోకు. తర్వాత బాగానే సేద్యం చేస్తుందని ఆశీర్వదించారు. ఆ ఎద్దు బక్కగా ఉన్నా కొండంత పని అంతులేకుండా చేసేది. ఆ రైతు, ఎద్దు కోరక పోయినా వారిద్దరినీ రక్షించారు శ్రీ స్వామివారు.

36. కలిచేడు పోలిరెడ్డి గారికి కో ఆపరేటివ్ సొసైటీలో కొన్ని చిక్కులు వచ్చాయి. ఆ సమయంలో వారు పని చేసే గనిలో



మేనేజరు పని ఖళీ వుంది. కానీ సొసైటీ గొడవల వలన వారు గని ఓనర్ గారైన రాజాగారిని మేనేజర్ పని తనకిమ్మని అడిగినా ప్రయోజనముండదని అడగలేదు. వారు ఒక రోజు శ్రీ స్వామి వారిని దర్శించి ఏమీ చెప్పుకోకుండానే దూరంగా నిలుచున్నారు. "అయ్యా" ఈయన పాతాళలోకానికి అధిపతి కావాలి వాళ్ళెందుకో అడ్డు తగులుతున్నారు. దేవుడు వాటినన్నింటిని తీసేస్తాడు. ఈయన కొక చీటీ వ్రాసి యివ్వండి అని శ్రీ స్వామి వారు ఆదేశించారు. వారి ఆశీస్సుల చీటీ ప్రభావంతో వారే ప్రయత్నం చేయకుండనే వారిని గనిలోపల మేనేజరుగా నియమించారు.

37. వక్కమ్మగారు అపుడపుడూ వచ్చి శ్రీ స్వామి వారిని దర్శించి ఇంటికి వెళ్ళుచుండేవారు. ఒకప్పుడు శ్రీ స్వామి వారామెలో ఎలాంటి మార్పు తెచ్చారో గానీ స్వామిని వదిలిపెట్టి ఇంటికి పోలేకపోయింది. ఆమె వచ్చి నమస్కరిస్తే, "వక్కమ్మ చచ్చి పోయిందనుకున్నానే" అన్నారు శ్రీ స్వామి వారు. వారు కోరకుండానే వారిలోని ఆశా, వ్యామోహము, బంధుప్రీతి, చాపల్యములను శ్రీ స్వామి వారు యోగ శక్తితో క్షాళన చేసేసారు.

38. గుత్తా నరసమ్మగారు శ్రీ స్వామి వారి సేవలో ఉండేవారు. అపుడపుడూ ఇంటికి వెళ్ళి తన వాళ్ళందరినీ చూచి రావాలని ఉండేది. శ్రీ స్వామి వారిని అడిగితే పంపరు. ఒక రోజు "నరసమ్మ చచ్చిపోయింది" అని చీటీ వ్రాసి వారి ఆశీర్వాద

ముద్ర వేసి నరసమ్మ కిచ్చారు. అది మొదలుకొని ఆమెకు ఇంటి ధ్యాస లేకుండా పోయింది. వారు కోరకుండానే వారిలోని మోహ బంధాలను త్రెంచి మేలు చేసారు. శ్రీ స్వామివారు తన నాశ్రయించిన వారందరికీ ఈమెకు చేసినట్లు మోహబందాలు నిర్మూలించ వచ్చు గదా అని అడగవచ్చు. నరసమ్మగారి లాగా ఎవరైనా ఆశ అనే రెండక్షరాలు దూరం చేసి శ్రీ స్వామి వారిని సేవిస్తే వారు తప్పక ఆమెను కరుణించినట్లు కరుణిస్తారు. ఆశను దూరం చేయడమంటే- బ్రతకాలని కూడా ఆశ ఉండకూడదంటారు పెద్దలు. ఒకప్పుడు వీరి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఇనుకుర్తి గ్రామ బడిలో శ్రీ స్వామి వారున్నారు. మూడు రోజుల నుండి గాలివాన, గాలివానలో స్వామి సేవకులు బిక్షాన్నానికి పోరు. సేవకులు అన్నంతినకుంటే శ్రీ స్వామి వారు గంజిత్రాగరు. గనుక ఈమె రాత్రి ఎనిమిది గంటలప్పుడు గాడాంధకారమైన చీకటిలో, గాలి, వాన లెక్క చేయకుండా శ్రీ స్వామి వారి బృందానికి అన్నం తెచ్చింది. పూర్తిగా తడిసి వణికిపోతున్నది. ఈ చీకటిలో పోతే నీవు తప్పక చస్తావన్నారు ఇంటిలోవారు. ప్రాణాల మీద అశ వదిలి అన్నం తెచ్చింది. అలాగా అందరమూ చేయలేము. గనుకనే కరుణామూర్తియైన శ్రీ స్వామి వారు ఆమె మోహ బంధాలు దగ్ధమొనర్చారు.



ఈమె కుటుంబం అన్నానికి కరువులేకుండా జీవించే వారే గాని పెద్ద ఉన్నత కుటుంబీకులు కాదు. ఒక రోజు కనీసం ఆరుకిలోల సజ్జకుడుములు చేసి వాటిని మూడు కిలోమీటర్ల దూరంలో నారాయణదాసు ఆశ్రమానికి తెచ్చి స్వామి వారికి సేవకులకు వచ్చిన భక్తులకు పెట్టింది. ఆరు కిలోల సజ్జలు పిండి విసరాలంటే ఎంత కష్టమో యోచించండి. ఈ రోజులలో వలె పిండి ఆడే మిషన్లు లేవు అప్పుడు. అన్ని కుడుములు పెట్టాలంటే కట్టెలెన్ని కావాలి. వాటిని తయారు చేయాలంటే శ్రమ ఎంత - వాటిని మూడు కిలోమీటర్ల దూరం మోయడం ఎంత శ్రమో యోచించండి. ఇంత తెస్తే వాటిని శ్రీ స్వామి వారు తినరు. శ్రీ స్వామి వారి సన్నిధిలో ఎవరు తిన్నా స్వామి వారు తినినట్లేనని ఆమె భావం. అన్ని జీవులలో వెంకయ్య ఉన్నారని వ్రాసుకో మన్నారు గదా శ్రీ స్వామివారు. అలాంటి అంకిత సేవా భావముంది గనుకనే ఆమె మోహపాశాలన్నీ తుడిచేశారు.

39. చిలకలమర్రి దేవుడయ్యగారు చాలా బీదవారు. శ్రీ స్వామి వారు వారి గ్రామం వచ్చినపుడు 5,6 పర్యాయములు శ్రీ స్వామి వారి బృందమంతటికీ ఎంతో భక్తి శ్రద్ధలతో వీరొక్కరే ఆతిథ్య మిచ్చేవారు. వారి ధర్మ బుద్ధికి శ్రీ స్వామి సంతోషించి వారేమీ కోరకుండానే ఒక రోజు వారిచే రాగి అంబలి కాయించి ఒక క్రొత్త కుండలో పోసి మూతపెట్టి అంబలి

కుండను రాజుగారింట ఈశాన్య దిశలో ఒక గజంలోతులో భూమిలో పూడ్పించారు. ఆనాటి నుండి వారు సిరి సంపదలతో ఎంతో ప్రఖ్యాతిగాంచి ఎంతో ఉన్నత స్థితి పొందారు.

40. తూపిలి వెంకయ్య పెద్ద గుడ్డల మూట నెత్తిని పెట్టుకొని బస్సు పైన వేయడానికి నిచ్చెన ఎక్కాడు. ఎవరో తెలియక రైట్ చెప్పడంతో బస్సు కదిలి నిచ్చెన పైనుండి అతడొక ప్రక్క మూటొక ప్రక్క పడిపోయారు. అరవై అడుగుల దూరం పోయి బస్సు ఆగింది. కానీ అతనికి కనీసం చిన్నదెబ్బ కూడా తగలలేదు. కేవలం ఈ ప్రమాదంలో అతని ప్రార్థన లేకుండానే శ్రీ స్వామివారే రక్షించారు. అంతకు ముందు మూడు రోజుల క్రిందట స్వప్నంలో ఆయన భార్య పిచ్చమ్మకు శ్రీ స్వామివారి సమాధి మందిర పూజారి కనిపించి ఆమెకు కుంకుమ బొట్టు పెడతానన్నాడు. ఆమె చేతిలో పెట్టమని అడగగా ఆయన అలాగే పెట్టారు. దీని ద్వారా శ్రీ స్వామియే రక్షించారని గ్రహించారు.

41. ఆ రోజులలో శ్రీ స్వామివారి అగ్నిగుండం సమాధి మందిరం ముందు నేలమీద వేయబడి ఉండేది. గుండం చుట్టూ ఈనాడు ఉన్నట్లు గోడలు ఉండేవి కావు. ఒకరోజు తూపిలి వెంకయ్య గారి కుమార్తె మూడు సం॥రాల శ్యామల, మరొక



పాపతో ఆడుకుంటూ ధుని చుట్టూ తిరుగుతున్నది. ఆ ఆటలో అవతలి పాప శ్యామలను మండుతున్న అగ్నిగుండం లోనికి తోసింది. ప్రజ్వరిల్లే మంటలలో బిడ్డ పడింది. భయంతో పెద్ద కేక వేసి మూత్ర విసర్జన చేసింది. దూరంగా ఉన్న నాగయ్య గారు పరుగున పోయి ఆ బిడ్డను బైటకు లాగేశారు. ఆ పాపకు వెంట్రుకలు కూడా చెక్కు చెదరలేదు. చేతులు కూడా కందలేదు. ఎవరూ ప్రార్థించక పోయినా శ్రీ స్వామివారే రక్షించారు.

42. పెమ్మసాని శ్రీహరి నాయుడు గారు శ్రీస్వామివారిని తన బండిలో వారు కోరిన మజిలీకి తీసుకు వెళ్ళేవారు. ఆయన భార్య శ్రీ స్వామి వారి విడిదికి వెళ్ళి నమస్కరించగా " అమ్మా నీకు పసుపు కుంకుమ గండమున్నది. తిరువళ్ళూరు వీరరాఘవస్వామి తప్పిస్తారు" అని చెప్పారు. ఆ రాత్రి వారింటికి శ్రీస్వామివారు వచ్చి ధుని వెలిగించి వెళ్ళారు. మర్నాడు నాయుడుగారు వారి ఎద్దుకు గడ్డి వేస్తుండగా ఎద్దు వారిని బిరజాల దగ్గర తన కొమ్ములు దూర్చి ఎత్తి అవతల వేసింది. బిరజాలలో కొమ్ము గుచ్చుకొని చర్మం చీలి పొత్తి కడుపు వరకు ఆరు అంగుళముల పొడుగున గాయమై ఆసుపత్రిలో కుట్లు వేయించుకొని, చాలా రక్తం పోయింది. ప్రాణాహాని తప్పింది. వారేమీ ప్రార్థించకుండానే శ్రీ స్వామి వారు రాబోయే ప్రమాదంలో వారి ఆశీస్సులతో ప్రాణాపాయం తప్పించారు.

పై అనుభవములను బట్టి శ్రీ స్వామి వారు చైతన్య రూపులై విశ్వమంతా ఉన్నారని తెలుస్తుంది. కానీ వారు మనలను పరివేష్టించి మనలోపల వెలుపల రాత్రి పగలు అనే భేదము లేకుండా అన్ని వేళలా ఉన్నారు అనే విషయం మనం గుర్తించడమే లేదు. వారు సర్వత్రా ఎలా ఉన్నారు? సర్వ సాక్షిగా ఉన్నారు. సాక్షిగా మాత్రమే గాక సర్వకర్మ ఫలప్రదాతగా ఉన్నారు. మనం ప్రార్థించినా ప్రార్థించక పోయినా మన కర్మలకు ప్రతిఫలం వెంటనే సిద్ధం చేస్తుంటారు. అయితే ఈ కర్మల ఫలం వెంటనే మనకు అనుభవం కావచ్చు లేక ఆలస్యంగా అనుభవం కావచ్చు. ప్రతి కర్మ ఫలం కూడా కొంత బరువు కలిగి ఉంటుంది. ఈ బరువుననుసరించి అది మన కర్మల వరుసలో ఎక్కడ సూటౌతుందో అక్కడ నిలుస్తుంది. ఉదాహరణకు ఒక గాజు గ్లాసులో నీళ్ళు తీసుకొని ఆ నీటిలో ఒక బెండు వేశాము. అది నీటిలో తేలుతుంది. ఆ తర్వాత ఒక కొయ్య ముక్క వేశాము. అది బెండు కంటే కింద ఉంటుంది. ఒక ఇనుప చీల వేస్తే అది నీటి అడుగునకు పోతుంది. మొదట వేసిన బెండు అడుగున ఉండదు కదా. అవి వాటి సాంద్రతను బట్టి నీటిలో నిలుస్తాయి. మన కర్మలు కూడా వాటి బరువును బట్టి కర్మల క్యూలో నిలుస్తాయి.

శ్రీ స్వామి వారు అన్ని సమయాలలోను అన్ని ప్రదేశాలలోను చైతన్య రూపులుగా ఉండి మన పనులు, మాటలు మాత్రమే



గాక మన ఆలోచనలను గూడా తెలుసుకొంటూ వాటికి తగిన ఫలితాలను ప్రసాదిస్తుంటారు. ఈ విషయం తెలిసి కూడా మాయకు లోబడిన మనమంతా మరలా మరలా తప్పులు చేస్తూనే ఉంటాము. ఈ మాయ మధించిన ఏనుగు వంటిదని దానిని లొంగదీయుటకు సద్గురువు అనబడు పురుష సింహమే తగినవాడని పెద్దలు చెప్పారు. కనుక మనం సద్గురు కృప పొందినట్లయిన ఈ మాయ మనలనేమియు చేయలేదని చెప్పారు. గనుక మనధ్యేయమంతా సద్గురు కృప పొందడములోనే ఉండాలి.

మన పుణ్యమే మనలను సద్గురు దరిచేరుస్తుంది. ఏ జీవికి ఉపకారం చేసినా పుణ్యమని, ఏ జీవికి అపకారం చేసినా పాపమని శాస్త్రాలు చెపుతున్నాయి. అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకోమని శ్రీ స్వామి వారు చెప్పారు గదా. గనుక మనం ఏ జీవికీ అపకారం చేయకుండా సర్వ జీవులకు ఉపకారం చేసే విధంగా మన జీవిత విధానం సవరించుకొని తరించేటట్లు చేయమని ఆ సద్గురు మూర్తిని హృదయ పూర్వకంగా ప్రార్థిద్దాము.

ఏది తిన్నా త్రాగినా మొదట అది సద్గురు కృప వలన వారి కృషితో మన కందించబడుతుందనే ఎరుకతో వారికి నివేదించి వారికి కొంత వదలి స్వీకరిస్తుంటే ఎప్పటికైనా గురు కృప పొందగలుగుతాము.

శరణం శరణం శరణం సద్గురురాయా!

## శ్రీ స్వామి వారి విలక్షణమైన గొప్పలు

1. తాను ఏ భక్తుని ఎలా ఆశీర్వదించినా, ఎవరికి ఏమి చెప్పదలచినా కాగితం మీద వ్రాయించి ఇచ్చేవారు. ఈ విధంగా వ్రాయించి ఇచ్చిన మహనీయులే ఇంతవరకు ఎవ్వరూ లేరు.

2. తాను నడిచినన్ని రోజులలోను ఒక్క క్షణం కూడా ఏమారకుండా గురురూపమైన అగ్నిని రాత్రింబవళ్ళు తన చెంతనుంచుకునే వారు. కపిల మోకు ముక్కలకు నిప్పంటించి నడిచేటప్పుడు వెంట తీసుకువెళ్ళేవారు.

3. సమాధి చెందేవరకూ తన గుట్టు వెల్లడి కాకుండా తిరవళ్ళూరు వీర రాఘవస్వామి నెల్లూరు రంగ నాయకుల స్వామి వారికి మ్రొక్కమని, టెంకాయ కొడితే బాగుంటుందని చెప్పేవారు. వారి మహిమను అనుభవించిన వారు ప్రక్కవారికి చెప్పకుండా తనయోగశక్తిచే వారించేవారు. చివరి వరకు పిచ్చి వెంకయ్య గానే ఉన్నారు గాని ఒక్క ప్రశంశగాని, ఒక్క పువ్వుగానీ అంగీకరించలేదు.

4. నడిచినన్ని రోజులు ఒక్క ఇంటి దగ్గరే బిక్ష స్వీకరించేవారు.

5. తరించే మార్గము చెప్పమంటే చూచి నేర్చుకోమన్నారు.



## మా ఇతర ప్రచురణలు

| | | | |
|---|---|---|---|
| 1. | వార్తాలాపము | (1050 పే) | రూ. 150-00 |
| 2. | అవధూత లీల | (316 పే) | రూ. 40-00 |
| 3. | అవధూత బోధామృతము | | రూ. 15-00 |
| 4. | స్వామి సన్నిధి | | రూ. 15-00 |
| 5. | శ్రీ ధునీవాలా దాదా | | రూ. 15-00 |
| 6. | స్వామి కృప | | రూ. 1-50 |
| 7. | పిలిచిన పలికే దైవం | | రూ. 1-50 |
| 8. | శ్రీ వెంకయ్య స్వామి పూజ | | రూ. 1-50 |
| 9. | మౌన బోధ | | రూ. 1-50 |
| 10. | ధర్మమూర్తి | | రూ. 1-50 |
| 11. | సాయి కృప | | రూ. 1-50 |
| 12. | దివ్యలీలలు | | రూ. 1-50 |
| 13. | అవధూత లీల | (ఇంగ్లీషు) | రూ. 30-00 |
| 14. | శ్రీ వెంకయ్య స్వామి | (ఇంగ్లీషు) | రూ. 5-00 |
| 15. | అవధూత లీల | (తమిళం) | రూ. 50-00 |
| 16. | శ్రీ వెంకయ్య స్వామి | (తమిళం) | రూ. 5-00 |
| 17. | పాటల పుస్తకం | | రూ. 1-00 |
| 18. | పాకల పాటి గురువు | | రూ. 1-00 |